విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107



సంపుటి: 16 | సంచిక : 131 | శుక్రవారం 11. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00




# బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టాలి

## సీఎల్పీ భేటీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ
- "వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం.
- సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది.
- ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు.
- పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు.
- మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు.
- స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు.
- ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి.
- ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా.
- ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి"

హైదరాబాద్ తెలంగాణ వాణి)
అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం ఉత్కంఠభరితంగా సాగింది. ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షం తీరు, అసెంబ్లీలో జరిగిన పరిణామాలు, భవిష్యత్ వ్యూహంపై నేతలకు దిశానిర్దేశం చేశారు. అధికారం పోయినా అహంకారం వీడకుండా బీఆర్ఎస్ నాయకులు ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన సభను సజావుగా జరగకుండా కుట్రలు చేశారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషించి మూడు రోజులు సభ జరగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించడం, స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించడం హేయమన్నారు. నిరసన తెలిపేందుకు ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పికొట్టి, ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలియజేసిన ప్రజాప్రతినిధులను అభినందించారు. జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టడం జరిగిందని స్పష్టం చేశారు. సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనాలని, హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా రాణించలేరని హెచ్చరించారు.

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు



- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానం
- పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు
- ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు
- త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటాం
- "కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం.
- హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు రాబోతున్నాయి.
- వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం.

## చెరువుల్లో నిమజ్జనాలకు మేం వ్యతిరేకం కాదు



- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- సోషల్ మీడియాలో హైడ్రా దుష్ప్రచారం చేస్తున్నారు
- "కేంద్రం నోటిఫై చేసిన 4-5 చెరువుల్లోనే గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు
- హైడ్రా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి ఆంక్షలు లేవు.
- మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.
- పీవోపీ విగ్రహాల నిమజ్జనం కోసం ప్రతి చెరువు వద్ద ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నాం

## హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు బీభత్సం

- పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లి..
- అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఘటన
- దిల్‌సుఖ్‌నగర్ డిపోనకు చెందిన బస్సు చౌటుప్పల్ వెళ్తుండగా ఈ ఘటన
- ఓ కారు పూర్తిగా ధ్వంసం కాగా.. మరో వాహనం దెబ్బతింది.
- డీజిల్ పంపు వద్దకు దూసుకెళ్లడంతో దానికి సంబంధించిన పరికరాలు విరిగిపడ్డాయి.
- ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.
- ఈ ప్రమాదంతో బంక్ సిబ్బంది, అక్కడ ఉన్నవారు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు
- అతివేగం కారణంగా బస్సు అదుపుతప్పినట్లు సమాచారం.
- దీనికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి



ఆయుష్ విద్యార్థులకు
## స్టైఫండ్ డబుల్

స్టైఫండ్స్ భారీగా పెంచుతూ జీవో జారీ
సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్
జీవో కాపి అందజేసిన దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్ తెలంగాణ వాణి) ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ 34,385 నుంచి 74,482కు మిగతా 2లో..

## ఏ శక్తి బీజేపీ గెలుపును ఆపలేరు

ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే
ఖచ్చితంగా అధికారంలోకి
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్ తెలంగాణ వాణి)
తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు మిగతా 2లో..

కాళోజీ వారసత్వాన్ని
## పుణికి పుచ్చుకోవాలి

మంత్రి జూపల్లి
రవీంద్రభారతిలో ఘనంగా కాళోజీ జయంతి ఉత్సవాలు
వీఆర్ విద్యార్థికి కాళోజీ సాహిత్య పురస్కార ప్రదానం



హైదరాబాద్ తెలంగాణ వాణి) :
కాళోజీ నారాయణరావు ప్రజల గొంతుకగా, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా బుధవారం రవీంద్రభారతిలో మిగతా 2లో..

## 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్
ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్
5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు
దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు
7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం
తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం
4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు
రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
మీడియాకు వెల్లడించిన అశ్విని వైష్ణవ్



హైదరాబాద్ తెలంగాణ వాణి) రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ మిగతా 2లో..

## మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ



సమాచార శాఖలో మట్టి గణపతుల పంపిణీ

హైదరాబాద్ తెలంగాణ వాణి)
పర్యావరణ పరిరక్షణ గాను మట్టి వినాయకుడిని పూజించాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీని కమీషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ, పండుగలను పర్యావరణ పరిరక్షణలో భాగంగా భాధ్యతాయుతంగా జరుపుకోవాలని అన్నారు. జల వనరుల పరిరక్షణ కాలుష్య నివారణకు కేవలం మట్టి గణపతి మాత్రమే మిగతా 2లో..

## రైజింగ్ సమ్మిట్‌కు ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్

మంత్రి ఉత్తమ్ ప్రత్యేక ఆహ్వానం
సానుకూలంగా స్పందించిన ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్
తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన
మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాల కొనుగోలుపైనా ఆసక్తి
అంతర్జాతీయ విపణిలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు



02

## రేవంత్‌రెడ్డి దోపిడీని నిలదీస్తామనే అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారు

- మాజీ మంత్రి బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ఒక్క రేవంత్‌రెడ్డి కుటుంబం మాత్రమే బాగుపడింది
- రూ.200 కోట్లు విలువ చేసే భూమిని సీఎం సోదరుడి కంపెనీకి ఎలా కేటాయించారు..
- అన్నీ బయటకు వస్తాయనే తమను అసెంబ్లీ నుంచి బయటకు పంపారు
- "అనుముల అన్నదమ్ముల దోపిడీపై భాజపా ఎందుకు మాట్లాడట్లేదు.
- మంత్రి పొంగులేటి కూడా డిఫెన్స్, ఏరోస్పేస్ కంపెనీ పెట్టారు.
- దోచుకున్నది అంతరిక్షంలో దాచుకునేందుకు చేస్తున్నారు.
- ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు బలిపశువులు కావొద్దు.
- ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ ఉండదు. ఫ్యూచర్ సిటీపై రంగారెడ్డి జిల్లాలో ఊరూరా సదస్సులు పెట్టి వివరిస్తాం.
- న్యాయస్థానానికి కూడా వెళ్తాం, అన్ని మార్గాల్లో పోరాటం చేస్తాం...





## పీవీటీజీలకు మెరుగైన వైద్య సేవలు

**మంచిర్యాల, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**
కాశిపేట మండలం వెంకటాపూర్ ఆదివాసీ పీవీటీజీ గ్రామంలో ఏర్పాటు చేసిన మల్టీపర్పస్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో కలిసి పరిశీలించారు. పీఎం జన్మన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో వైద్యం, పౌష్టికాహారం, విద్య, సంక్షేమ సేవలు అందించాలని సూచించారు. గ్రామంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న వైద్య సేవలు, టీకాలు, పోషకాహార పంపిణీపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి వారం మూడు గ్రామాల ప్రజలకు వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో పీవీటీజీలకు అందుతున్న వైద్య సేవలపై అదనపు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



**మంచిర్యాల, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**
సామాజిక అన్యాయం, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం నేటి తరానికి ఆదర్శమన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణేశ విగ్రహాలను పంపిణీ చేసి, పర్యావరణ పరిరక్షణపై గోడ ప్రతులను ఆవిష్కరించారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా జల కాలుష్యాన్ని నివారించవచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతు దోపిడీకి చెక్

### పీఏసీఎస్ ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులు



**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 10**
(తెలంగాణ వాణి ప్రతినిధి): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సరసమైన ధరలకు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా పీఏసీఎస్ కేంద్రాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంచాలని సూచించారు. మహాముత్తారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించి, ఆన్‌లైన్ బిల్లింగ్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కొనుగోలు చేసిన వెంటనే రైతుల మొబైల్‌కు సందేశం, బిల్లులు, రసీదులు వాట్సాప్‌కు చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంపిణీలో పూర్తి పారదర్శకత పాటిస్తూ అక్రమాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు.

## అంతర్జాతీయ క్రీడాపోటీలలో రాణించిన గీతం విద్యార్థిని

**పటాన్ చెరు, సెప్టెంబర్ 10, (తెలంగాణ వాణి):**
పికిల్ బాల్ ప్రపంచ కప్ 2026లో రెండు పతకాలు సాధించిన బీబీఏ తొలి ఏడాది విద్యార్థి ఆశ్రిత వియత్నాం లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ పికిల్ బాల్ ప్రపంచ కప్ 2026 పోటీలలో, హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, బీబీఏ తొలి ఏడాది విద్యార్థిని ఆశ్రిత రాజు దాట్ల రెండు పతకాలు సాధించి సంస్థకు గర్వకారణంగా నిలిచారు. 18 ఏళ్ల లోపు విభాగంలో పోటీ పడిన ఆశ్రిత, అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, బాలికల సింగిల్స్ లో రజత పతకాన్ని, డబుల్స్ లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఒక అంతర్జాతీయ క్రీడా పోటీలలో సింగిల్స్, డబుల్స్.. రెండింటిలోనూ పతకాలు సాధించడం ఒక గొప్ప ఘనత. ఇది ప్రపంచ వేదికపై రాణించాల నే ఆమె ప్రతిభ, క్రమశిక్షణ, పట్టుదల, సంకల్పానికి నిదర్శనం. ఆశ్రిత సాధించిన ఈ విజయం ఆమె కఠోర శ్రమ, నిబద్ధత, పికిల్ బాల్ పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనం. ఆమె విజయం, చదువుకు అతీతంగా రాణించడం, సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే అవకాశాలను అంది పుచ్చుకోవడం ప్రాముఖ్యతను కూడా చాటి చెబుతోంది. ఒక అంతర్జాతీయ క్రీడా కార్యక్రమంలో గీతం కు ప్రాతినిధ్యం వహించడం ద్వారా, ఇతర రంగాలలో రాణించాలని ఆకాక్షించే తోటి విద్యార్థులకు ఆమె స్ఫూర్తిగా నిలిచారు. గీతం నాయకత్వం, ఆశ్రిత సాధించిన ఈ అద్భుత విజయానికి అభినందించి, ఆమె అంకితభావం, క్రీడా స్ఫూర్తి, శ్రేష్ఠత పట్ల నిబద్ధతను ప్రశంసించింది. ఆమె మరిన్ని విజయాలను సాధించి, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ప్రోత్సహించారు. వియత్నాం లో తన అద్భుతమైన ప్రదర్శనతో, ఆశ్రిత వర్ధమాన యువ క్రీడాకారులకు ఒక గొప్ప ప్రమాణాన్ని నెలకొల్పింది. అంకితభావం, పట్టుదల, నిరంతర కృషితో ఆశయాలను అంతర్జాతీయ వేదికపై విజయాలు గా మార్చు కోవచ్చని ఆమె ప్రస్థానం నిరూపిస్తోంది.







# దళితులను అవమానిస్తే సహించం

- దళితుల ఓట్లతో అధికారం.. హామీల అమలులో మాత్రం మోసం!
- మూడెకరాల భూమి హామీ ఏమైంది?
- ఫామ్‌హౌస్ ఘటనకు జవాబు చెప్పండి
- దళితుల పట్ల ఇదేనా మీ నిబద్ధత?
- దళితులను మోసం చేసిన కేసీఆర్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు
- కేసీఆర్‌పై రమేష్ రావణ్ ఫైర్




**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టి.ఎన్. రమేష్):**
దళితులను ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసిన మాజీ సీఎం కేసీఆర్, దళితుల పట్ల తన వైఖరిని మార్చుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ ఆర్మీ తెలంగాణ చీఫ్ రమేష్ రావణ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆల్ ఇండియా అంబేద్కర్ ఆర్మీ జిల్లా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో దళితులు కీలక పాత్ర పోషించారని, ఉద్యమంలో పాటలు పాడుతూ, ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ రాష్ట్ర సాధన కోసం పోరాడారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు ఇచ్చిన హామీలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. దళితులకు మూడెకరాల భూమి హామీ ఏమైందని ప్రశ్నించారు. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోకుండా, తమ నిరసన తెలిపేందుకు కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లిన దళితులను భద్రతా సిబ్బందితో అడ్డుకోవడం సరికాదన్నారు. అనంతరం ఫామ్‌హౌస్ పరిసరాలను పసుపు నీటితో శుద్ధి చేశారనే ఆరోపణలు దళితుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. దళితులు, బీసీలు, ఎస్టీలు, మైనార్టీలను రాజకీయంగా మోసం చేశారని రమేష్ రావణ్ ఆరోపించారు. దళితులకు ఇచ్చిన హామీలపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో దళితులు రాజకీయంగా చైతన్యవంతులై తమ హక్కులను కాపాడుకునేలా నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.



## రైతులకు ఎలాంటి ఇబ్బందులు రావద్దు: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



: వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. 2026-27 వానాకాల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ గురువారం సెక్రెటేరియట్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 2026-27 వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు అయిందని, సుమారు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. గత వానాకాలం సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

### 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని సీఎస్ సూచించారు. రైతుల ఆధార్ వివరాలను చెల్లింపుల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డీఎస్ చౌహాన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం: మంత్రి పొంగులేటి



పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30--40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150--200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు.

ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించలేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి.. తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. దశాబ్దాలుగా గుడిసెల్లోనే జీవిస్తున్న పేదలకు రెండో విడతలో శుభవార్త అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలను రెండో విడతలో ప్రాధాన్యతగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ మోడల్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారి భౌతిక పరిశీలన పూర్తిచేసి తుది జాబితా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌లో గృహప్రవేశాలు జరిగేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇతర కార్పొరేషన్లలోనూ ఇదే విధానాన్ని పైలట్ మోడ్‌లో అమలు చేస్తున్నామని, అవసరమైతే మున్సిపాలిటీల్లోనూ పరిశీలిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**నిబంధనలు సడలించాలి : సభ్యులు**

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో నిబంధనలను సడలించాలని సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మేడిపల్లి సత్యం, మనోహర్ రెడ్డి కోరారు. స్లాబ్ ఏరియాను 750ఎస్ఎఫ్టీ నుంచి 1000ఎస్ఎఫ్టీకి పెంచాలని మేడిపల్లి సత్యం సూచించారు. జీవనోపాధి కోసం తీసుకున్న ఆటోలు,ట్రాక్టర్లతో పేరుతో ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడంలేదని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లు ఎగ్గొట్టిన రుణాలను మాఫీ చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్లకు మాత్రం నిధులివ్వడంలేదని మనోహర్ రెడ్డి విమర్శించారు.

## క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి



**వనపర్తి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన 8వ ఎడిషన్ ఆర్జే ఇంటర్ స్కూల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్--2026లో ప్రతిభ కనబరిచిన రెయిన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అభినందించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. నిరంతర సాధనతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## రాజగోపాల్‌రెడ్డి కృషితో చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనం




**చౌటుప్పల్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ కోర్టుకు నూతన భవనం మంజూరు కావడం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కృషి ఫలితమేనని ప్రభుత్వ న్యాయవాది వాకిటి నర్సింహారెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సర్వే నంబర్ 50లో ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో నూతన కోర్టు భవన నిర్మాణానికి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు న్యాయవాదుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## అవినీతి అధికారుల భరతం పడతాం



**వనపర్తి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అవినీతికి పాల్పడే అధికారులపై నిరంతరం పోరాటం చేస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు అన్నారు. గురువారం వనపర్తిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టల్ వార్డెన్ అవినీతిపై ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం వార్డెన్‌తో పాటు సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఉద్యోగిని సస్పెండ్ చేశారని తెలిపారు. ఇది బీసీ పొలిటికల్ జేఏసీ పోరాటానికి మరో విజయమన్నారు. అవినీతి అధికారులను నిలదీస్తూనే నిజాయితీగా పనిచేసే అధికారులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో 'మారెమ్మ' సందడి

### తెలంగాణ పల్లె సంస్కృతికి అద్దం పట్టిన చిత్రానికి విశేష ఆదరణ



**చౌటుప్పల్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
తెలంగాణ పల్లె సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించేలా తెరకెక్కిన 'మారెమ్మ' చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గురువారం చౌటుప్పల్‌లోని శ్రీనివాస థియేటర్‌ను చిత్ర బృందం సందర్శించి ప్రేక్షకుల స్పందనను తెలుసుకుంది. హీరోయిన్ దీప బాలు, నిర్మాత బండారు మయూర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, కుషల్ రెడ్డి, సందీప్ రెడ్డి తదితరులు ప్రేక్షకులతో ముచ్చటించారు. సినిమా కథ, గ్రామీణ నేపథ్యం, తెలంగాణ సంస్కృతి, నటీనటుల ప్రదర్శన ఆకట్టుకున్నాయని ప్రేక్షకులు తెలిపారు. ఈ స్పందన తమకు మరింత ఉత్సాహాన్నిస్తోందని చిత్ర బృందం పేర్కొంది.

## చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి



**చిలుకూరు, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి**
**):** భూస్వాముల ఆగడాలకు ఎదురొడ్డి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడిన చాకలి ఐలమ్మను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య అన్నారు. చిలుకూరు మండల కేంద్రంలో ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో పుట్టపాక అంజయ్య, గంగాధర్, సిరాపురపు శీను, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# నీటి వనరుల వృథాపై నిరంతర పర్యవేక్షణ



**నిజామాబాద్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అందుబాటులో ఉన్న నీటి వనరులు వృథా కాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ జలాలు చివరి ఆయకట్టు వరకు చేరేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలువలు, తూముల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, నీటి వృథాకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలు అందించాలని, ఖరీఫ్ పంట సేకరణకు గోడౌన్లలోని బియ్యం నిల్వలను తరలించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీఆర్వో గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, పౌరసరఫరాల అధికారి అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



**నిజామాబాద్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్‌ను తెరిచి ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి భద్రపరిచిన గదులను పరిశీలించారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, ఎన్నికల సామగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, సిబ్బంది సాత్విక్, విజయేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు

# గోదావరి పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

### కందకుర్తి, యంచ పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**నిజామాబాద్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వచ్చే ఏడాది జూన్, జూలైలో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. గురువారం రెంజల్ మండలం కందకుర్తి, నవీపేట మండలం యంచ పుష్కర ఘాట్ల వద్ద అభివృద్ధి పనులకు కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. కందకుర్తిలో రూ.6.05 కోట్లతో పుష్కర ఘాట్, రూ.3.90 కోట్లతో రోడ్లు, రూ.5 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు, యంచలో రూ.2.15 కోట్లతో ఘాట్, రూ.70 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. భక్తుల రాకపోకలు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్లు శ్రవణ్, వెంకట రమణ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలి

**నిర్మల్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేఖరి):**
మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బందికి ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, కృత్రిమ రంగులతో పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు. పండుగలను సంప్రదాయబద్ధంగా, పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మల్ స్పెషల్ సబ్‌జైల్‌లో భద్రతపై ఎస్పీ పరిశీలన



**నిర్మల్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేఖరి):**
నిర్మల్ స్పెషల్ సబ్‌జైల్‌ను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ గురువారం సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సబ్‌జైల్ సూపరింటెండెంట్ పుష్పగుచ్ఛంతో ఎస్పీకి స్వాగతం పలికారు. జైలు ప్రాంగణం, సీసీటీవీ కెమెరాల పనితీరు, భద్రతా సిబ్బంది విధులు, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను ఎస్పీ పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచిస్తూ, వారి పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఏఆర్ ఆర్ఐ రామ్‌నిరంజన్, జైలర్ సూర్యప్రకాశ్ రెడ్డి, హెడ్ వార్డెన్, జైలు గార్డింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి



**నిర్మల్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేఖరి):**
కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, అధికారులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ పోషించిన పాత్రను కొనియాడారు. దొరలు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి, వెట్టి చాకిరీ నిర్మూలనకు కృషి చేసిన వీరనారి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఆమె చరిత్రను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, సిపిఓ గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో మండల రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షులు అయ్యన్న సాయి ప్రసాద్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్ గౌడ్, ఎల్లారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు, ఎల్లారెడ్డి రజక సంఘం ప్రజలు పాల్గొన్నారు.



## ఎంబీబీఎస్ సీటు సాధించిన ఎడవల్లి శ్రావణి

**వనపర్తి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎంబీబీఎస్ సీటు సాధించిన ఎడవల్లి శ్రావణిని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు అభిన ందించారు. రాంనగర్ కాలనీలోని ఆమె నివాసానికి వెళ్లిన కమిటీ సభ్యులు మాదారి భోజరాజు, ద్యారపోగు వెంకటేష్, చింతకుంట విశ్వం బాబు శ్రావణిని శాలువాతో సన్మానించి, స్వీట్లు తినిపించారు. భవిష్యత్తులో ఉన్నతంగా రాణించి వైద్యురాలిగా సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు.

## మందమర్రి ఏరియాలో వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం



**మందమర్రి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**
మందమర్రి సింగరేణి హైస్కూల్ మైదానంలో ఏరియా అంతర్ విభాగీయ 62వ వార్షిక క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఉద్యోగుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు. క్రీడాకారులు కంపెనీ, కోల్ ఇండియా స్థాయి పోటీల్లో రాణించి సింగరేణి ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు. తొలి రోజు జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో కే.కే-5 గ్రూప్ విజేతగా, కాసిపేట-2 గ్రూప్ రన్నరప్‌గా నిలిచాయి. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూజీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, క్రీడల కార్యదర్శి ఎం. కార్తీక్, సమన్వయకర్త ఎస్. శివకృష్ణ పాల్గొన్నారు

## ప్రమాద రహిత ఉత్పత్తికి కృషి చేయాలి




**మందమర్రి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**
క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రమాద రహిత ఉత్పత్తి సాధనకు కృషి చేయాలని కేకే ఓసీ మేనేజర్ మధుసూదన్ సూచించారు. గురువారం ఓసీ ఉద్యోగులు, అధికారులతో మాట్లాడుతూ రక్షణ సూత్రాలు పాటించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీస్తాయని అన్నారు. పని ప్రదేశాల్లో పర్యవేక్షణ పెంచాలని, అధికారులు--ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 2026--27 ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించి సింగరేణిలో రికార్డు సాధించాలని, బొగ్గు నాణ్యత ప్రమాణాలను పాటించాలని కోరారు. అనంతరం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు మేనేజర్‌ను పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్నకొండ ఆంజనేయులు, ఫిట్ కార్యదర్శి నూనె సాంబయ్య తదితరులు పాల్గొన్నారు..

## కేసీఆర్‌కు వ్యతిరేకంగా 'చావు డప్పు' కార్యక్రమం

**బోథ్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



తెలంగాణ సమాజానికి, ముఖ్యంగా దళితులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ డిమాండ్ చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వ్యాఖ్యలు, దళిత నాయకుల పట్ల బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలిని నిరసిస్తూ శనివారం ఉదయం 11 గంటలకు తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో 'కేసీఆర్ చావు డప్పు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భీంపూర్, తాంసి, తలమడుగు మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా గోపాల్‌రావు జన్మదిన వేడుకలు



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది జి. గోపాల్‌రావు జన్మదిన వేడుకలను గురువారం సీనియర్ సిటిజన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌కు రూ.4 వేల విరాళం అందజేశారు. విరాళం అందించిన గోపాల్‌రావుకు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్‌వాడీ టీచర్ పోస్టుల దరఖాస్తుదారుల జాబితా విడుదల




**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అంగన్‌వాడీ టీచర్ పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా భూపాలపల్లి, మహాదేవ్‌పూర్ ప్రాజెక్టుల పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను సంబంధిత గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించినట్లు జిల్లా సంక్షేమాధికారి జి. మల్లేశ్వరి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి 24 వరకు అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వెరిఫికేషన్ తేదీ, సమయం వివరాలను సంబంధిత సీడీపీఓ కార్యాలయాల ద్వారా అభ్యర్థులకు వ్యక్తిగతంగా తెలియజేస్తామని తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత తేదీలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలి



**వనపర్తి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్తో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ, సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. మహిళలు హక్కులపై అవగాహనతో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట పటిమ అందరికీ ఆదర్శమని అన్నారు. సామాజికవేత్తలు రాజారాం ప్రకాష్, గంధం నాగరాజు ఆలపించిన ఐలమ్మ పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారిని ప్రమీల, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పర్యావరణ పరిరక్షణలో భాగంగా భూపాలపల్లిలో మట్టి గణపతి విగ్రహాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంబేద్కర్ చౌక్, బస్‌స్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ ఎస్ఐ ఏ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ఏఈఎస్, జిల్లా నోడల్ అధికారి డా. శ్రీకాంత్ సహకారంతో ప్రజలకు 300 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డా. శ్రీకాంత్ విద్యార్థులకు పర్యావరణహిత మట్టి విగ్రహాలపై అవగాహన కల్పించి 500 విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నక్ష బాట ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని వినతి



**రాజపేట, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేఖరి):**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం బొందుగుల గ్రామంలో యూఎస్ఎం సిటీ వెంచర్ యాజమాన్యం నక్ష బాటను అక్రమంగా ఆక్రమించుకుందని ఆరోపిస్తూ 2006--07 ఎస్ఎస్‌సీ బ్యాచ్ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నక్ష బాటను పరిరక్షించి, ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బాల్ద శ్రీకాంత్, ముత్యం కరుణాకర్, సంగు మహేష్, రాజం బాలరాజు, భీమని కరుణాకర్, నర్మెట రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గోల్డెన్ తులిప్ కాలనీలో వన్ డే--వన్ వార్డు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేకరి):**
కొండాపూర్ డివిజన్ గోల్డెన్ తులిప్ కాలనీలో గురువారం నిర్వహించిన వన్ డే--వన్ వార్డు కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని, తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, రోడ్లు, మౌలిక వసతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, మున్సిపల్ కమిషనర్ సృజన, జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్, డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం శ్రీహరి, మేనేజర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు. వినాయక చవితి సందర్భంగా కాలనీవాసులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కురుమూర్తి సాగర్, విద్యా సాగర్ రెడ్డి, కాకి నిర్మల, షేక్ చాంద్ పాషా, రాజేష్ యాదవ్, శ్రీనివాస్ చౌదరి, సుద్దపల్లి విజయ్ కృష్ణ, బాల్ రెడ్డి, తిరుపతి యాదవ్, రజనీకాంత్, ముప్పిడి మోహన్ బాబు, శివ కుమార్, విజయ్ శర్మ, దాసరి కృష్ణ, గిరిధర్, ఎస్వియన్ రాజు, బారేందర్ రెడ్డి, నాగేశ్వరరావు, సురేందర్, సత్యనారాయణ, ప్రతాప్ రెడ్డి, ప్రసాద్, కొల్లూరి మధు ముదిరాజ్, గొల్లెం యాదగిరి, అబేద్ అలీ, గిరి గౌడ్, సత్తిబాబు, డా. శివకుమార్ , జానయ్య, తోట విజయలక్ష్మి, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రవీందర్ కుటుంబానికి కానిస్టేబుల్ బ్యాచ్ అండ

### రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత

**చిగురుమామిడి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేకరి):**
అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన చిగురు మామిడి మాజీ జడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ కుటుంబానికి ఆయన సహచర 1996 కానిస్టేబుల్ బ్యాచ్ మిత్రులు అండగా నిలిచారు. గురువారం రవీందర్ స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన ఇద్దరు కుమార్తెలకు రూ.లక్ష నగదు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాచ్ ప్రతినిధులు మాట్లాడుతూ 1996లో కానిస్టేబుల్‌గా తమతో కలిసి విధుల్లో చేరిన రవీందర్ శిక్షణ దశ నుంచే నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన, ప్రజాసేవ లక్ష్యంగా ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన ఆయన రెండు పర్యాయాలు సర్పంచ్‌గా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా, జడ్పీటీసీగా, ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు. రవీందర్



ప్రోత్సాహంతో ఏర్పాటు చేసుకున్న పొదుపు నిధి నుంచే ఈ సాయం అందించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఆయన పిల్లల చదువు, భవిష్యత్తుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వావిలాల మల్లారెడ్డి,ముదిరాజ్ సంఘం పెద్దమనిషి చెరుకు చిన్నసమ్మయ్య, గుండా కృష్ణకుమార్ గౌడ్, పుప్పాల శ్రీనివాస్, శంకర్ రెడ్డి, ముత్యాల బ్రహ్మయ్య, కనకయ్య, దామోదర్ రెడ్డి, కాంతారావు, సదాచారి,సుధాకర్ తదితర బ్యాచ్ సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

**మెదక్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్తో కలిసి ఐలమ్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమని, సామాజిక అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం అణగారిన వర్గాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం, గడీల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాల్వ మల్లేశం, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## వైద్యాధికారి సుజాత ఆకస్మిక తనిఖీ



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేకరి):**
జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. సుజాత గురువారం ఇబ్రహీంపట్నం మండలంలోని గోదావరి నది పరిసరాలను ఆకస్మికంగా సందర్శించారు. గోదావరి వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించి ఆరోగ్య సేవలు, ఓపీ రిజిస్టర్లు, రికార్డులు, మందుల లభ్యత, సిబ్బంది పనితీరును పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నివారణ, పారిశుద్ధ్య చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీవో రవీందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రూపేష్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు మినీ టిప్పర్లు పట్టివేత



**వీణవంక, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న మూడు మినీ టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో వాహనాలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తదితర ఖనిజాలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలి



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సేవా ప్రయాణం, దేశాభివృద్ధి, వికసిత్ భారత్--2047 సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈనెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యం పిలుపునిచ్చారు. గురువారం మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం 22ఏ నిషేధిత భూముల జాబితాలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ధరణి, భూభారతి పోర్టల్లలో డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి, తప్పుగా 22ఏ జాబితాలో చేర్చిన పట్టా భూములను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొంతల కళ్యాణ్ చంద్ర, మోహన్, గడ్డం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు శాలువాతో సన్మానించిన యూత్ అధ్యక్షులు అంజిత్ కుమార్



**జగిత్యాల /బుగ్గారం: 10 సెప్టెంబర్ (తెలంగాణ వాణి ప్రతినిధి )**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ కు యూత్ అధ్యక్షులు సిగిరి అంజిత్ కుమార్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన శకల్ల యూత్ అధ్యక్షులు జక్క విజయ్ కుమార్ ఉపాధ్యక్షులు చీపెల్లి విశ్వాస్, ప్రధాన కార్యదర్శి కుడుకల అంజి, జనరల్ సెక్రెటరీ మైదానం రమేష్, మరియు యశ్వంతరావుపేట గ్రామ యూత్ అధ్యక్షులు కొంపెల్లి సాయి,ఉప అధ్యక్షులు ఉరిమెట్ల మహేష్, ప్రధాన కార్యదర్శి నక్క గోపి, తదితరులు పాల్గొన్నారు

## దళితులు నడిచిన స్థలాన్ని శుద్ధి చేయడం అంటరానితనమే



**ధర్మారం, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**
సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ దళిత శ్రేణులు నిరసన చేపట్టిన అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీటితో ఆ ప్రాంతాన్ని శుద్ధి చేయడం అంటరానితనాన్ని ప్రోత్సహించడమేనని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో మండల అధ్యక్షుడు లౌద్య రూప్ల నాయక్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళిత సమాజాన్ని అవమానించే చర్యలను సహించబోమన్నారు. కార్యక్రమంలో జి. తిరుపతిరెడ్డి, కే. నరసింహులు, తుమ్మల తిరుపతి, ఓరెం చిరంజీవి, మేడ వేణి తిరుపతి, అరిగే లింగయ్య, కాడే సూర్యనారాయణ, సంఘ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ ఆశయాలు ఆదర్శనీయం

**ధర్మారం, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**
చారిత్రక యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక సర్పంచ్ దాగేటి రాజేశ్వరి అన్నారు. గురువారం ఐలమ్మ వర్ధంతిని వివిధ కుల సంఘాలు, రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించి ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల భూమి, భుక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు అర్ధవేల్లి రాము, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్ రూప్లా నాయక్, మాజీ వైస్ ఎంపీపీ మేడ వేణి తిరుపతి, మాజీ ఏఎంసీ చైర్మన్ కే బుచ్చిరెడ్డి, మాజీ ఏఎంసిమాజీ వైస్ చైర్మన్ లు కాడే సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశం గౌడ్, బి ఆర్ ఎస్ మండల మాజీ అధ్యక్షుడురాచారి శ్రీధర్, మాజీ ఎంపిటిసి తుమ్మల రాంబాబు, నాయకులు దేవి రాజలింగు, కూరపాటి శ్రీనివాస్, అమర పెల్లి నారాయణ, దేవి కిషోర్, కాంపెల్లి రాజేశం, గుమ్ముల నరసయ్య పాల్గొన్నారు.

## గ్రామాలల్లో వెలుగు కోసం శ్రమిస్తున్న విద్యుత్ అధికారులు



**చిగురుమామిడి సెప్టెంబర్ 10 ( తెలంగాణ వాణి విలేఖరి )**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం, గత రెండు రోజులుగా మండలంలో విద్యుత్ అంతరాయము కలగడంతో, విద్యుత్ తీగలకు అడ్డు వున్న చెట్లను తొలగిస్తున్న, విద్యుత్ అధికారులు,సుందరగిరి చిగురుమామిడి ఫీడర్ మధ్యన చెట్లు తీసివేస్తున్న విద్యుత్ అధికారులు,ఈ కార్యక్రమములో లైన్ ఇన్స్పెక్టర్ రాజ్ నాయక్, లైన్ మెన్ కనుకయ్య, అస్టింట్ లైన్ మెన్ రామకృష్ణ ,

## ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పాలి



**చెర్లపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి మమత ):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించాలని జేసీఐ హైదరాబాద్ చేంజ్ మేకర్స్ సూచించింది. జేసీఐ వీక్ వేడుకల్లో భాగంగా చెర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో 'సస్టైనబుల్ సిప్పింగ్ ప్రోగ్రామ్' నిర్వహించి కార్మికులకు ఉచితంగా స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. 'చిన్న మార్పు--సుస్థిర భవిష్యత్తుకు పెద్ద అడుగు' అనే సందేశంతో ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేసీఐ హైదరాబాద్ చేంజ్ మేకర్స్ అధ్యక్షుడు జేసీ రవి ముప్పిడి, చార్టర్ ప్రెసిడెంట్ జేసీ పి. శ్రవణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ గోడుగు రాము, ట్రెజరర్ మహేష్ మిట్టపల్లి, డైరెక్టర్ శ్రీశైలం మారటి తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు రమాదేవి, బావయ్యతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. గణేష్ మండపాలకు విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు తదితర సదుపాయాలు కల్పించాలని, నిమజ్జనం సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ మట్టి వినాయక విగ్రహాలను అధికారులకు పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులు పర్యావరణహిత మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, గ్రామపంచాయతీ, వైద్య ఆరోగ్య, విద్యుత్, ఫైర్, ఆర్అండ్‌బీ, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా కళాకారులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి



**భువనగిరి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేకరి):**
ప్రజా కళాకారుడు ఏపూరి సోమన్న పాటల ప్రస్థానానికి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భువనగిరిలోని ఏఆర్ గార్డెన్‌లో '25 ఏండ్ల పాటల ప్రవాహం' సభ నిర్వహించారు. ప్రజా కళాకారుడు మీసాల గణేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రజలను చైతన్యపరిచిన ఏపూరి సోమన్న సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రజా కళాకారులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, సోమన్న చట్టసభలకు వెళ్లే వరకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం '25 ఏండ్ల పాటల ప్రవాహం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బట్టు రామచంద్రయ్య, జేరిపోతుల పరుశురాం, కొడారి వెంకటేష్, చిలుకమారి గణేష్, బొల్లేపల్లి కుమార్, బైరపాక స్వామి, ఎర్ర సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మ్ పాండ్ పనులను పరిశీలించిన ఎంపీడీవో





**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండలం మోహన్‌రావుపేటలో జరుగుతున్న ఫార్మ్ పాండ్ నిర్మాణ పనులను ఎంపీడీవో రామకృష్ణ గురువారం పరిశీలించారు. అనంతరం బోర్‌వెల్ రీచార్జ్ పిట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. భూగర్భ జలాల సంరక్షణ, నీటి నిల్వల పెంపుతో పాటు పనుల నాణ్యతను పరిశీలించిన ఆయన, రైతులకు ఉపయోగకరంగా ఉండేలా నిర్ణీత ప్రమాణాలతో పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరికెళ్ల లతిక నరేష్, ఉపసర్పంచ్ జాన వెంకటేష్, కార్యదర్శి నర్సారెడ్డి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్టడీ సెంటర్ పనులను పరిశీలించిన ఎస్ఈ



**భువనగిరి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేకరి):**
యాదాద్రి భువనగిరి జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమార్‌ను గురువారం ప్రజా సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం సింగన్నగూడెంలో నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్‌ను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి స్టడీ సెంటర్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్, అధికారులను ఎస్ఈ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ భువనగిరి డివిజనల్ ఇంజనీర్ ప్రసాద్, యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ /ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బండారు రవివర్ధన్, సామాజిక ప్రజా సంఘాల నాయకులు బర్రె సుదర్శన్, కొడారి వెంకటేష్, నల్ల కృష్ణ, పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కోరుట్లలో ఘనంగా అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద వితరణ



**కోరుట్ల, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**
సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో శ్రీ శివ మార్కండేయ కోటి నవదుర్గ దేవాలయం, పద్మశాలి సంఘం ఆవరణలో గురువారం అన్నపూర్ణ అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సుమారు 900 మందికి అన్నప్రసాదం అందించారు. సంప్రదాయబద్ధంగా గోపూజ, అన్నపూర్ణ మాత పూజ నిర్వహించి, కార్యక్రమాన్ని ప్లాస్టిక్ రహితంగా చేపట్టారు. పితృదేవతల ప్రీత్యర్థం, లోకకల్యాణం కోసం ప్రతి అమావాస్యనాడు నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమం 14 నెలలుగా నిరంతరాయంగా కొనసాగుతోంది. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ వనపర్తి చంద్ర మోహన్, కన్వీనర్ గంప శివకుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు జిల్లా ధనుంజయ్, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల కోసం పోరాటం ఆగదు

**హుస్నాబాద్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ఆర్‌సీ):**
ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై బీజేవైఎం పోరాటం కొనసాగిస్తుందని రాష్ట్ర నాయకులు కర్ణకంటి నరేష్ అన్నారు. గురువారం హుస్నాబాద్ కోర్టుకు హాజరైన ఆయన మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నియోజకవర్గ వ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు పోలోజు రాజేందర్ ఉన్నారు.



## అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడాలి

**కోరుట్ల, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: కోరుట్ల పట్టణంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. ఎస్ఐఆర్ ఫారాల్లో వివరాల సవరణ, నోటీసులు, పెండింగ్ కేసులు, విచారణ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పేరు, ఇంటిపేరు, ఫొటో తదితర వివరాల్లో తప్పులను నిబంధనల ప్రకారం సరిచేయాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనాన్ని పరిశీలించారు. మిగిలిన పనులను వేగవంతం చేసి భవనాన్ని త్వరగా ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను



ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి సుజాత, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవో, వైద్యులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి

**జగిత్యాల, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జగిత్యాల చింతకుంటలోని ఆమె విగ్రహానికి రజక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ భూస్వాముల అరాచకాలను ధైర్యంగా ఎదిరించి తెలంగాణ విమోచన పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ఆమె పోరాటం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆమె ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జ్ఞానేశ్వర్, బబోరగల్ల పోషాలు, పెద్దింటి లక్ష్మణ్, మతులాపురం బుజ్జి, మర్రిపెల్లి లక్ష్మీనారాయణ, గుండరపు



రాజేశ్, మర్రిపెల్లి గంగాధర్, మతులాపురం శ్రీనివాస్, బోరగాల్ల తిరుపతి, గుండరపు శ్రీనివాస్, కళ్లేపల్లి దుర్గయ్య, మతులాపురం శంకర్, నీలం పెద్దూలు, వేణు రావు తదితరులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ త్యాగాలు స్ఫూర్తిదాయకం

**జగిత్యాల, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐలమ్మ పోరాట స్ఫూర్తిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆమె సేవలను స్మరించుకుంటూ ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ఐలమ్మ పేరుతో రాష్ట్ర మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి కే.వై. ప్రసాద్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## కుటుంబ బాధ్యతల నడుమ పీహెచ్‌డీ సాధన




**కాప్రా, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి మమత):**
కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పట్టుదలతో పరిశోధన పూర్తి చేసి కాప్రా--ఈసీఐఎల్‌కు చెందిన డా. దీపా బానోత్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఆమె డా. వి. సమున్నత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. తెలంగాణలోని ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం అనే అంశంపై ఆమె పరిశోధన నిర్వహించారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఉద్యోగుల సంతృప్తిని మెరుగుపరిచేందుకు పలు సూచనలను ప్రతిపాదించారు. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ పరిశోధన కొనసాగించి డాక్టరేట్ సాధించడం విశేషం. ఆమె పెద్ద కుమారుడు ఎంబీబీఎస్, చిన్న కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, విభాగాధిపతి ప్రొఫెసర్ విద్యాసాగర్‌రావుతో పాటు అధ్యాపకులు, పరిశోధకులు, సిబ్బంది ఆమెను అభినందించారు. తన విజయానికి భర్త రవితేజ, కుటుంబ సభ్యులు, పరిశోధన పర్యవేక్షకురాలు డా. వి. సమున్నత అందించిన ప్రోత్సాహం, సహకారం మరువలేనిదని డా. దీపా బానోత్ తెలిపారు. కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించి లక్ష్యాన్ని సాధించిన ఆమె విజయం మహిళలకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.

## గణేష్ ఉత్సవాల శాంతి కమిటీ సమావేశం

**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 10, (తెలంగాణ వాణి):**
రాబోయే వినాయక చవితి పండగ ప్రశాంతంగా జరుపు కొనుట గురించి పెద్ద శంకరం పేట మండల పరిధిలోని అన్ని గ్రామాల వినాయక మండపాల నిర్వాహకుల మీటింగ్ శంకరంపేట



పోలీస్ స్టేషన్ లో నిర్వహించారు. స్థానిక ఎస్ ఐ ప్రవీణ్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగ ను ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని సూచించారు. వినాయక మండపాల దగ్గర తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన వివరించారు. అలాగే ఆన్లైన్ ఫామ్ ఎలా నింపాలి అనే విషయాన్ని వారికి తెలియ జేశారు.



## పేటలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 10, (తెలంగాణ వాణి):**
పెద్ద శంకరంపేట పట్టణం రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి జరుపుకున్నారు. పెద్ద శంకరంపేట పట్టణ శివారు లోని తిరుమలా పూర్ చెరువు కట్ట వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం బాధ్యులు, నాయకులు, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల కోసం నిరంతరం పోరాడిన తెలంగాణ వీర వనిత అని ఆమె చేసిన సేవలు గురించి కొనియాడారు। ఈ కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ ఎన్ సంతోష్ కుమార్ , సుభాష్ గౌడ్, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చాకలి నారాయణ, మండల అధ్యక్షుడు చాకలి ప్రభు, బాధ్యులు కిష్టయ్య, సాయి, దస్తయ్య, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## 24వ వార్డులో హెల్త్ క్యాంప్ ప్రారంభం



**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట పట్టణంలోని 24వ వార్డులో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ గురువారం హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలందరూ క్యాంప్‌లో వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం, అపోహలను తొలగించడం, అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి వైద్య సూచనలు అందించడం క్యాంప్ ఉద్దేశమన్నారు. ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి రాము, డాక్టర్ మొహోన్నత, సూపర్‌వైజర్ సదానందం, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎం మంజుల, రజిత, ఆశా వర్కర్లు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం




**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి**
): బీఆర్ఎస్వీ నాయకులను తెల్లవారుజామున ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జమ్మికుంట బీఆర్ఎస్వీ టౌన్ అధ్యక్షుడు కొమ్ము నరేష్ అన్నారు. ముఖ్యమంత్రి నివాసం ముట్టడిస్తారనే అనుమానంతో అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు స్కూటీలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు తదితర హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచలేరని, హామీలు నెరవేర్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నల్లగాశ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫామ్‌హౌస్ పసుపు నీళ్ల ఘటనపై కాంగ్రెస్ నిరసన



**ఎండపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**
మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద నిరసనకు వెళ్లిన దళిత నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తిరిగి వెళ్లిన అనంతరం ఆ ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ ఎండపల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం రాజారంపల్లిలో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దళితుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే చర్యలను కాంగ్రెస్ సహించదన్నారు. దళితులపై జరుగుతున్న అవమానాలను బీఆర్ఎస్ నాయకులు ఖండించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో గూడ రాంరెడ్డి, గెల్లు చంద్రశేఖర్, కందికట్ల రాజేష్, సంగ రమేష్, గొల్లపల్లి మల్లేశం, బాల సాని శారద మల్లేశం, కోడిపల్లి కొమురమ్మ శ్రీనివాస్, పడిదం లావణ్య మొగిలి, బెద్దల ప్రవీణ్, గెల్లు శ్రీనివాస్, గాజుల విజయ్, కొంగల జగదీశ్వర్‌రెడ్డి, దర్శనాల నరేష్, సింగిరెడ్డి లింగారెడ్డి, శ్రవణ్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## కౌన్సిలర్ బత్తుల స్వరూప రవీందర్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**హుస్నాబాద్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ఆర్‌సీ)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 19వ వార్డులో కౌన్సిలర్ బత్తుల స్వరూప రవీందర్ ఆధ్వర్యంలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తరి పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బత్తుల స్వరూప మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. కార్డులతో సన్నబియ్యం తదితర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, ఆర్‌పీలు, రేషన్ కార్డుదారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి,వైస్ చైర్పర్సన్ చిత్తరి పద్మ, వార్డు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకురాల్లు, ఆర్ పిలు, రేషన్ కార్డుదారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి



**భువనగిరి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేకరి):**
తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో గురువారం భువనగిరిలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కొడారి వెంకటేష్ మాట్లాడుతూ ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఐలమ్మను 'చిట్యాల ఐలమ్మ'గా గౌరవించాలని కోరారు. ఆమె తెగువ, శౌర్యం, త్యాగం నేటి తరం మహిళలకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి జిల్లా నాయకులు మాటూరి అశోక్, ఏశాల అశోక్ రత్నపురం పద్మ, వడ్డెబోయిన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి అరెస్టులు సరికాదు



**ధర్మారం, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**
ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును అడ్డుకునేందుకు అర్ధరాత్రి అక్రమ అరెస్టులకు పాల్పడటం సరికాదని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు దేవి వంశీకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం ముట్టడికి అవకాశం ఉందనే కారణంతో నిద్రలో ఉన్న తమను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని ఖండించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న విద్యార్థి, యువజన నాయకులను నిర్బంధాలతో అణచివేయాలని చూడడం తగదన్నారు. అరెస్టయిన వారిలో గంధం తిరుపతి, బోయిని రాజకుమార్, కాంపెల్లి చందు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ కోతలపై రైతుల రాస్తారోకో

**కాలిన మోటార్లతో రహదారిపై నిరసన..**



**రాయికల్: సెప్టెంబర్ 10(తెలంగాణ వాణి):**

రైతులకు ప్రకటించిన విద్యుత్ సరఫరాలో కోతలు విధించడాన్ని నిరసిస్తూ పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు గురువారం రాయికల్ పట్టణంలో ఆందోళనకు దిగారు.పట్టణంలోని విద్యుత్ ఉపకేంద్రం ఎదుట ఉన్న జగిత్యాల--రాయికల్ ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.కాలిపోయిన విద్యుత్ మోటార్లను రహదారిపై ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.వ్యవసాయానికి కనీసం 12 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ ఎప్పుడు నిలిచిపోతుందో,ఎప్పుడు పునరుద్ధరిస్తారో రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు.రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై సుధీర్‌రావు,విద్యుత్ శాఖ జగిత్యాల రూరల్ ఏడీఈ సింధూర శర్మ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు.వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ నెల 20వ తేదీలోగా సమస్యలను పరిష్కరించాలని రైతులు విద్యుత్ అధికారులను కోరారు.అప్పటిలోగా సమస్యలు పరిష్కారం కాకపోతే రహదారిపై వంటావార్పు తదితర కార్యక్రమాలు చేపట్టి ఆందోళనను ఉధృతం చేస్తామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు.

## బీఆర్ఎస్ నుంచి టీఆర్ఎస్‌లోకి పలువురి చేరిక



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

: సిర్గాపూర్ మండలం ఉజ్జంపాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తోడే నగేష్, సాదుల సంజీవ్ ముదిరాజ్, దండి యాదయ్య తదితరులు టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాపుమల్ శెట్టి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాపుమల్ శెట్టి మాట్లాడుతూ బహుజన తెలంగాణ సాధన, ప్రజా సంక్షేమం కోసం టీఆర్ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాణిక్యం ముదిరాజ్, సంగమేశ్ చారి, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎస్ జి ఎఫ్ పోటీలు

**బహుమతులు ప్రధానం చేసిన ఖేడ్ సిఐ శ్రీనివాస్ రెడ్డి**




**నారాయణఖేడ్ :సెప్టెంబర్ 10 (తెలంగాణవాణి ప్రతినిధి)**

నారాయణఖేడ్ మండలం పరిధిలోని వివిధ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్ జి ఎఫ్ ఐ గేమ్స్ గురువారంతో ముగిసినాయి..ఈ సందర్భంగా అండర్ 14 అండర్ 17 వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ పోటీలలో విజేతలైన వారికి నారాయణఖేడ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కరకములచే బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఇన్ఫాక్ట్ ఫౌండేషన్ బాధల్ గామా సంతోష్ ద్వారా క్రీడలకు మెమొంటోస్ మెడల్స్ ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఫిజికల్ డైరెక్టర్లు సంగ్రామ్ మారుతి గణేష్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ దన్సింగ్ , ఇన్ఫాక్ట్ ఫౌండేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని, భద్రతా ఏర్పాట్లు చేసుకుని ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి ఉత్సవాలను సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.

## గీతంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం



**పటాన్ చెరు, సెప్టెంబర్ 10, ( తెలంగాణ వాణి):**

హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కు చెందిన అప్లైడ్ సైకాలజీ విభాగం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ఆత్మహత్యల నివారణపై బహిరంగ చర్చలను ప్రోత్సహించడం లక్ష్యంగా పలు కార్యక్రమాలతో సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పాటించింది. 'ఆత్మహత్యలపై కథనాన్ని మార్చడం', 'చర్చను ప్రారంభించండి' అనే ఇతివృత్తంతో, మానసిక ఆరోగ్యంపై నెలకొన్న మౌనాన్ని ఛేదించడం, అలాగే వ్యక్తులు సహాయం కోరడానికి సౌకర్యవంతంగా భావించే సహాయక వాతావరణాన్ని సృష్టించడం యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పారు. భావోద్వేగ శ్రేయస్సు, మానసిక ఆరోగ్య సవాళ్లు, మద్దతు, ఆశ, ఆత్మహత్యల నివారణ వంటి అంశాలను అన్వేషించే ప్రదర్శనలు, కళాకృతులు, ఇతర సృజనాత్మక వ్యక్తీకరణల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ చొరవ గీతం సమాజాన్ని సంభాషణలు ప్రారంభించడానికి, కళంకాన్ని సవాలు చేయడానికి, భావోద్వేగ బాధలను అనుభవిస్తున్న వారి పట్ల సానుభూతి, అవగాహనను పెంపొందించడానికి ప్రోత్సహించింది. ఈ కార్యక్రమాల ద్వారా, అప్లైడ్ సైకాలజీ విభాగం ప్రాంగణం అంతటా మరింత అవగాహన కల్పించడానికి, శ్రద్ధ, అనుబంధం, మద్దతు సంస్కృతిని ప్రోత్సహించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.

## క్యాన్సర్ చికిత్సలో ఆధునిక సాంకేతికత

**యశోద హాస్పిటల్స్‌లో ఇన్‌హౌస్ ఎన్‌జీఎస్ సదుపాయం**

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**




క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలో అత్యాధునిక నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్) సదుపాయాన్ని హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు డా. శిఖర్ కుమార్ తెలిపారు. గురువారం కరీంనగర్‌లోని యశోద హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎన్‌జీఎస్ ద్వారా క్యాన్సర్ కణితుల్లోని జన్యు మార్పులను గుర్తించి, రోగికి అనుగుణంగా లక్షిత చికిత్స (టార్గెటెడ్ థెరపీ) అందించేందుకు సహాయపడుతుందని తెలిపారు. ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయంతో పాటు పలు రకాల క్యాన్సర్ల చికిత్సలో ఈ సాంకేతికత ఉపయోగపడుతుందన్నారు. పరీక్షలు ఆస్పత్రిలోనే నిర్వహించడం వల్ల ఫలితాలు త్వరగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రోబోటిక్ సర్జరీ, ఎంఆర్ఐ-లినాక్ రేడియేషన్ థెరపీ తదితర ఆధునిక సదుపాయాలతో సమగ్ర క్యాన్సర్ వైద్యం అందించడమే తమ లక్ష్యమని ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు.




## పాత్రికేయుల హక్కుల సాధనే యూనియన్ ధ్యేయం

**టేక్మాల్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**

పాత్రికేయుల హక్కుల సాధనతో పాటు వృత్తిపరమైన భద్రత, గుర్తింపు కోసం జర్నలిస్టులంతా ఐక్యంగా ఉండాలని టీయూడబ్ల్యూజే మెదక్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి పిలుపునిచ్చారు. గురువారం టేక్మాల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, సభ్యత్వ నమోదు జర్నలిస్టుల ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెదక్ ప్రెస్‌క్లబ్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, జిల్లా నాయకులు ఆనంద్, సుభాష్, మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు యాదయ్య, జర్నలిస్టులు కృష్ణ, రమేష్, నాయికోటి వెంకటేష్, పవన్, రాజు నాయక్, సుధాకర్, అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.ఖ

## సీఎం రేవంత్‌పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**

నకిలీ ఎక్స్ ఖాతాలోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని అసెంబ్లీలో సీఎం ఎ. రేవంత్‌రెడ్డి వాస్తవ విరుద్ధమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. రూల్ 168 కింద అసెంబ్లీ సెక్రటరీ రెడ్ల తిరుపతికి గురువారం నోటీసు అందజేశారు. 'బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి సంధ్యారావు' పేరిట ఉన్నట్లు పేర్కొన్న నకిలీ ఎక్స్ ఖాతా పోస్టును సీఎం సభలో ప్రస్తావించి సభ్యులను తప్పుదోవ పట్టించారని ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటరీని కోరారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**జమ్మికుంట, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



అణగారిన వర్గాల హక్కులు, భూమి, భుక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమని కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జమ్మికుంటలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ మహిళా శక్తికి, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచారని, ఆమె ఆశయాలను నేటితరం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఆలేటి శ్రీరామ్, గూడెపు దేవేందర్, శ్రీకాంత్, నాగరాజు, వినోద్, అంజన్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**

చాకలి ఐలమ్మ జీవితం మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచి, ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా పటాన్‌చెరు డివిజన్‌లోని రజక సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆమె పేరును హైదరాబాద్‌లోని మహిళా విశ్వవిద్యాలయానికి పెట్టడం, వారసులకు గౌరవం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు మహేష్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## కోరుట్లలో ఈఎస్ఐ సేవలు అందుబాటులోకి

**బీడీ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి:**

**జువ్వాడి నర్సింగారావు**



**కోరుట్ల, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):**

కోరుట్ల పట్టణంలో త్వరలో ఈఎస్ఐ సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు తెలిపారు. నియోజకవర్గంలోని బీడీ కార్మికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గురువారం కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కోరుట్లకు ఈఎస్ఐ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు హయాంలో నియోజకవర్గంలో వెటర్నరీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఫిల్టర్‌బెడ్, నూతన మున్సిపల్ భవనం, సుమారు 5 వేల ఇందిరమ్మ ఇళ్ల వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ హమ్మద్ షాహెద్ ఉల్ అహద్, మార్కెట్ కమిటీ చైర్మన్, మండల అధ్యక్షుడు పొన్నాల అంజిరెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం తదితరులు పాల్గొన్నారు.

## ఐదు నెలలుగా జీతాలు లేక.. కంప్యూటర్ ఆపరేటర్ల సామూహిక సెలవులు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి విలేకరి):**

జగిత్యాల జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఐదు నెలలుగా జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో జిల్లాలోని అన్ని మండలాల కంప్యూటర్ ఆపరేటర్లు గురువారం సామూహిక సెలవులు పెట్టి సంబంధిత ఎంపీడీవోలకు సెలవు పత్రాలు అందజేశారు. నెలల తరబడి జీతాలు లేక కుటుంబ పోషణ, రోజువారీ ఖర్చులు, విధులకు రాకపోకలు కూడా భారంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు, పంచాయతీ పరిపాలనకు సంబంధించిన ఆన్‌లైన్ సేవల్లో కీలకంగా పనిచేస్తున్న తమ సమస్యను వెంటనే పరిష్కరించి పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో యువత పోరాటాలకు సిద్ధం కావాలి



**కొమురవెల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో యువత ప్రజా ఉద్యమాల్లో ముందుకు సాగాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం ఆమె చూపిన మార్గంలో ముందుకు సాగాలని, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

## అంతర్గాం మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘన సన్మానం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**

అంతర్గాం మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సింగం కుమార్‌గౌడ్‌ను పెద్దపల్లి డీసీసీ కో-ఆర్డినేటర్ (జేబీఎం) అలకుంట రాజేశం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా అలకుంట రాజేశం మాట్లాడుతూ నూతన అధ్యక్షుడు పార్టీని మండలంలో మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు దొబ్బల తరుణ్ కుమార్, రఘు, కార్తీక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పసి శ్రీనుతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొని సింగం కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు

## బ్రతుకు భారమై.. విధులకు దూరమై

**జీతాల కోసం ఈ-పంచాయతీ ఆపరేటర్ల నిరసన**



రాయికల్, సెప్టెంబర్ 10 (తెలంగాణ వాణి):

జగిత్యాల జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతాలు లేక విధులకు రాకపోకల ప్రయాణ ఖర్చులు కూడా భరించలేక రాయికల్ మండల ఆపరేటర్లు సామూహిక సెలవులు ప్రకటించి నిరసన తెలిపారు. ఎంపీడీవోకు సామూహిక సెలవు పత్రాలు అందజేశారు. ప్రభుత్వ పథకాలు, పంచాయతీ పరిపాలనకు సంబంధించిన కీలక ఆన్‌లైన్ సేవలు అందిస్తున్న తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్, రమేష్, కృష్ణహరి, నరేందర్ పాల్గొన్నారు.




# ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్ ప్రారంభం

**బ్రాండ్ అంబాసిడర్లుగా హర్భజన్ సింగ్, సురేష్ రైనా**

**32 జట్లు, 127 మ్యాచ్‌లు..**

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :** భారత సాఫ్ట్‌బాల్ క్రికెట్‌ను మరింత ఉన్నత స్థాయికి చేర్చే లక్ష్యంతో 'ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్' రెండో సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. తొలి సీజన్‌తో పోలిస్తే దాదాపు మూడు రెట్ల విస్తృతితో దేశవ్యాప్తంగా 32 జట్లు, 127 మ్యాచ్‌ల భారీ షెడ్యూల్‌ను లీగ్ నిర్వాహకులు ప్రకటించారు. ప్రముఖ క్రికెట్ దిగ్గజాలు హర్భజన్ సింగ్, సురేష్ రైనా బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వీక్షకులకు చేర్చేందుకు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, స్క్రీనాక్స్, మైఆసియా వంటి సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ రాజు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం సాఫ్ట్‌బాల్ క్రికెట్‌ను ప్రజలు గుర్తించేలా చేయడానికి ప్రయత్నించేవాళ్లమన్నారు. ఇప్పుడు మా వద్ద 32 జట్లు ఉన్నాయన్నారు. చాలా జట్లలో చిన్న చిన్న పట్టణాల నుంచి ఆటగాళ్లు వచ్చారన్నారు. సీజన్ 2 ప్రత్యేకత ఇదేనన్నారు. ఈ సందర్భంగా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ మాట్లాడుతూ లీగ్ ఎంత పెద్దదైతే అంత ఎక్కువ మంది యువ ఆటగాళ్లకు గుర్తింపు దక్కే అవకాశం ఉంటుందన్నారు.

ఈ సందర్భంగా సోనీ స్పోర్ట్స్ ఏవీపీ కౌశిక్ కల్లూరి మాట్లాడుతూ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో కేవలం ఒక ఆటను టెలివిజన్‌లో ప్రసారం చేయడమే కాదన్నారు. ఈ ఆటకు ఒక ప్రత్యేకమైన నేపథ్యం ఉందన్నారు. ఎందుకంటే, ఇది అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన ఆటగాళ్లకు పెద్ద వేదికపై తమ ప్రతిభను చాటుకునే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. సీజన్ 2 ఇంత భారీ స్థాయిలో విస్తరిస్తున్న తరుణంలో ఈ ప్రయాణంలో భాగస్వాములు కావడం, ఈ క్రీడను మరింత విస్తృతమైన ప్రేక్షకులకు చేర్చడంలో సహాయపడటం మాకెంతో ఉత్సాహాన్నిస్తోందని తెలిపారు. మా అనుబంధం ఆటగాళ్లకు, జట్లకు క్రీడకు మరింత గుర్తింపును తెస్తుందని, దేశవ్యాప్తంగా మరింత మంది యువ క్రికెటర్లు ఈ క్రీడలో తమకూ ఒక స్థానం ఉందనే నమ్మకాన్ని కలిగించేలా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైఆసియా ప్రతినిధి నూరుల్ అమీన్ మాట్లాడుతూ ఇది కేవలం ఒక్క సీజన్‌కు మాత్రమే పరిమితమైన స్పాన్సర్‌షిప్ కాదన్నారు. భారతదేశంలో సాఫ్ట్‌బాల్ క్రికెట్ వృద్ధిపై పెట్టిన దీర్ఘకాలిక పెట్టుబడి అని స్పష్టం చేశారు.

జాతీయ, అంతర్జాతీయ టెలివిజన్ ప్రేక్షకులకు అందించేందుకు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ అధికారిక ప్రసార భాగస్వామిగా ఉంది. దేశవ్యాప్తంగా 1500 పైగా స్క్రీన్లలో ఈ మ్యాచ్‌లను ప్రదర్శించడానికి స్క్రీనాక్స్ అధికారిక స్క్రీనింగ్ భాగస్వామిగా వ్యవహరించనుంది. ఇక అంతర్జాతీయ లీగ్‌గా విస్తరించడంతో పాటు వాణిజ్యపరంగా క్రీడా ప్రాపర్టీగా తీర్చిదిద్దే బాధ్యతతో మైఆసియా వ్యూహాత్మక భాగస్వామిగా జతకట్టింది. ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి, ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ బీహెచ్ అనిల్ కుమార్, వైస్ చైర్మన్ సంజీవ్ సింగ్ పాల్గొన్నారు.

# తిలక్ వర్మ 99 ఔట్..



**ఈస్ట్ జోన్‌కు 372 రన్స్ ఆధిక్యం**

చెన్నై : దులీప్ ట్రోఫీ ఫైనల్లో నాలగువ రోజు ఇవాళ తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టు కెప్టెన్ తిలక్ వర్మ తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. అతను వ్యక్తిగతంగా 99 రన్స్ వద్ద ఔటయ్యాడు. తిలక్ వర్మ పోరాడినా.. ఈస్ట్ జోన్ మాత్రం భారీ ఆధిక్యాన్ని సాధించింది. ఈస్ట్ జోన్‌కు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 372 రన్స్ లీడ్ దక్కింది. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముకేశ్ కుమార్ మూడు వికెట్లు తీసుకోగా, షమీ.. ఖురేషి, మోహన్.. రెండేసి వికెట్లు తీసుకున్నారు. ప్రస్తుతం లంచ్ కావడంతో.. సౌత్ జోన్ ఫాలోఆన్ ఆడుతుందా లేక ఈస్ట్ జోన్ మళ్లీ బ్యాటింగ్ చేస్తుందా అన్న దానిపై క్లారిటీ లేదు. సౌత్ జోన్ తన చివరి నాలుగు వికెట్లను కేవలం 18 రన్స్‌కే కోల్పోయింది. ఈస్ట్ జోన్ తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 708 రన్స్ చేసిన విషయం తెలిసిందే.

# జపాన్‌లో భారీ వరదలు..

**ఆసియా గేమ్స్‌కు ముప్పు..**

**అథ్లెట్స్ తరలింపు**



**జపాన్:** జపాన్‌లో జరగబోతున్న ఆసియా గేమ్స్‌కు భారీ వర్షాలు, వరద ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే అక్కడ అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదవుతున్నాయి. గేమ్స్ జరిగే నగోయా ప్రాంతంలో కూడా వర్షాలు పడుతుండటంతో అథ్లెట్లను ఇక్కడి నుంచి అత్యవసరంగా మరో చోటుకు తరలించారు. దీంతో రాబోయే రోజుల్లో కూడా వర్షాలు పడితే.. ఆసియా గేమ్స్ నిర్వహణే కష్టతరమవుతుంది. దీంతో ఈ గేమ్స్ నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. జపాన్‌లోని నగోయా పట్టణంలో ఆసియా గేమ్స్ సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్నాయి.

ఇందుకోసం వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు ఇప్పటికే జపాన్ చేరుకున్నారు. కొన్ని గేమ్స్‌కు సంబంధించిన పోటీలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అనేక దేశాలకు చెందిన అథ్లెట్లు జపాన్ చేరుకుంటున్నారు. 36 క్రీడలకు సంబంధించిన 503 మంది అథ్లెట్లు ఇందులో పాల్గొంటున్నారు. వీరిలో 269 మంది పురుషులు, 234 మంది స్త్రీలు ఉన్నారు. ఆసియా క్రీడలకు వేదిక కానున్న నగోయా పట్టణంలో ప్రస్తుతం భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళవారం ఒక్క గంటలోనే 104 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

దీంతో ఈ నగరలో ఉన్న వందలాది మంది అథ్లెట్లు, ఇతర క్రీడాకారుల్ని యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. కొన్ని షిప్పింగ్ కంటైనర్లలోనే క్రీడాకారులకు వసతి ఏర్పాటు చేయగా.. వారిని కూడా ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు తరలించింది. ఇక్కడి తాత్కాలిక షెల్టర్లలో 400 మంది వరకు క్రీడాకారులు, ఇతర సిబ్బంది బస చేస్తున్నారు. అయితే, వర్షాలు, వరదల వల్ల క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందీ లేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని జపాన్ అధికారులు వెల్లడించారు. అలాగే, క్రీడలు జరిగే వేదికలకు కూడా ఏ ఇబ్బందీ లేదన్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారమే క్రీడలు జరుగుతాయని స్పష్టం చేశారు.




## బిజినెస్ Business

# ఉద్యోగులకు ఉబర్ కొత్త నిబంధన..

**మారిన వర్క్ ఫ్రమ్ హోమ్ రూల్స్**

**ఉబర్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం కఠినతరం**

**వారానికి 3 రోజులు ఆఫీసుకు రావాలని ఉద్యోగులకు ఆదేశం**

**ఇటీవల 3,300 మందిని తొలగించిన కంపెనీ**

**పూర్తి రిమోట్ వర్క్‌కు కేవలం 1 శాతం మందికే అనుమతి**

**ఈ నిబంధనలు డ్రైవర్లకు వర్తించవని స్పష్టం**




**న్యూఢిల్లీ:** ప్రముఖ రైడ్-షేరింగ్ దిగ్గజం 'ఉబర్', తన కార్పొరేట్ ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఇకపై ఉద్యోగులు వారానికి కనీసం మూడు రోజులు పాటు కార్యాలయం నుంచే విధులు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కంపెనీ సీఈఓ దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా అధికారిక సమాచారం అందించారు. ప్రస్తుతం రిమోట్‌గా పని చేస్తున్న వారు సైతం తమ బృందాలతో కలిసి పనిచేసేందుకు వీలుగా, కార్యాలయాలు ఉన్న ప్రాంతాలకు మారాలని ఆయన సూచించారు. మొత్తం ఉద్యోగుల్లో కేవలం ఒక శాతం మందికి మాత్రమే పూర్తిస్థాయిలో రిమోట్ వర్క్ చేసేందుకు అనుమతి ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది. మేనేజర్లు, వారి బృందాలు ఒకే చోట ఉండి పని చేయాలనేదే తమ ప్రధాన ఉద్దేశమని, ఇందుకోసం న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కో నగరాల్లో ప్రత్యేక హబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఇటీవల ఊబర్ తన ప్రపంచ వ్యాప్త సిబ్బందిలో సుమారు 10 శాతం మందిని, అంటే దాదాపు 3,300 మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించిన విషయం విదితమే. భారీగా ఉద్యోగాల కోత విధించిన అనంతరం కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అనవసరమైన మేనేజ్‌మెంట్ విభాగాలను తగ్గించడంతో పాటు పెట్టుబడులు సమీక్షలో భాగంగానే ఈ మార్పులు చేపడుతున్నట్లు కంపెనీ తెలిపింది. అయితే, ఈ నూతన నిబంధనలు కేవలం కార్పొరేట్ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తాయని, డ్రైవర్లు లేదా ఇతర ఆపరేషనల్ సిబ్బందిపై వీటి ప్రభావం ఉండదని ఊబర్ స్పష్టం చేసింది.

# మార్కెట్‌లో చమురు 'మంటలు'..

**సెన్సెక్స్ 813 పాయింట్లు పతనం**

**203 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ**

**వరుసగా మూడో సెషన్‌లో మార్కెట్లు కుదేలు**

**100 డాలర్లకు చేరిన బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర**

**ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు నమోదు**

**ఆందోళనలు పెంచిన అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు**



**ముంబై:** అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ముదరడం, అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు చేరువ కావడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ నష్టాల్లో ముగిశాయి. వరుసగా మూడో సెషన్‌లోనూ సూచీలు పతనమయ్యాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లలో భారీ అమ్మకాలు మార్కెట్లపై మరింత ఒత్తిడి పెంచాయి.

సెన్సెక్స్ 813.35 పాయింట్లు నష్టపోయి 74,764.23 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 203.60 పాయింట్లు క్షీణించి 23,431.50 వద్ద ముగిసింది. నిఫ్టీకి 23,550-23,600 స్థాయి తక్షణ నిరోధంగా ఉంటుందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 23,600 పైన నిలకడగా కొనసాగితే 23,700-23,800 దిశగా కోలుకునే అవకాశం ఉందన్నారు. దిగువన 23,400 స్థాయి తక్షణ మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు.

ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. నిఫ్టీ ఐటీ సూచీ 3 శాతానికి పైగా పడిపోయింది. రియల్టీ సూచీ కూడా నష్టాల్లోనే ముగిసింది. మరోవైపు మెటల్ సూచీ కొంత మెరుగ్గా రాణించి మార్కెట్ పతనాన్ని కొద్దిగా అడ్డుకుంది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లపైనా అమ్మకాల ప్రభావం పడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.51 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.48 శాతం నష్టపోయాయి. ముడిచమురు ధరలు పెరగడం మార్కెట్ వర్గాల్లో ఆందోళన పెంచింది. భారత్ భారీగా క్రూడ్ దిగుమతి చేసుకునే దేశం కావడంతో ధరలు పెరిగితే దిగుమతి బిల్లు, ఉత్పత్తి వ్యయాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో ద్రవ్యోల్బణంపై కూడా ఒత్తిడి పెరగొచ్చన్న భయాలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి. బుధవారం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఓ దశలో బ్యారెల్‌కు 100 డాలర్లను దాటింది.

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, క్రూడ్ ధరల పెరుగుదల, రూపాయి బలహీనత, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని నిపుణులు తెలిపారు. పశ్చిమాసియా పరిస్థితిపై స్పష్టత వచ్చే వరకు మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# పీఎఫ్ అడ్వాన్స్ రూల్స్‌లో కీలక మార్పులు

**ఈపీఎఫ్ అడ్వాన్స్ విత్‌డ్రా నిబంధనల సరళీకరణ**

**13 రకాల విత్‌డ్రాలను 3 కేటగిరీలకు కుదింపు**

**ఏడాది సభ్యత్వం తర్వాత 75 శాతం బ్యాలెన్స్ విత్‌డ్రాకు అనుమతి**

**వైద్య అవసరాల కోసం ఎన్నిసార్లయినా డబ్బు తీసుకునే సౌకర్యం**

**ఇంటి నిర్మాణం లేదా కొనుగోలుకు ఐదు సార్లు అడ్వాన్స్ పొందే అవకాశం**




**న్యూఢిల్లీ:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ ఖాతా నుంచి నిధుల పాక్షిక ఉపసంహరణ (అడ్వాన్స్) నిబంధనలను సంస్థ గణనీయంగా సరళీకరించింది. గతంలో అమల్లో ఉన్న 13 రకాల సంక్లిష్ట ఉపసంహరణ పద్ధతులను రద్దు చేసి, వాటి స్థానంలో కేవలం మూడు సులభతర విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నూతన నిబంధనల ప్రకారం, ఈపీఎఫ్‌లో సభ్యత్వం పొంది 12 నెలలు పూర్తి చేసుకున్న చందాదారులు తమ ఖాతాలోని నిల్వలో 75 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. అయితే, ఖాతాలో కనీసం 25 శాతం నిల్వను తప్పనిసరిగా కొనసాగించాల్సి ఉంటుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ గతంలోనే ఆమోదం తెలిపింది. తాజా సవరణల ప్రకారం, ఉపసంహరణ ప్రక్రియను మూడు ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు.

కేటగిరీ 1 (అత్యవసర అవసరాలు): అనారోగ్యం లేదా వైద్య చికిత్స నిమిత్తం సర్వీసు కాలంలో ఎన్నిసార్లయినా నిధులు తీసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే, చదువుల కోసం 10 సార్లు, వివాహ అవసరాల కోసం 5 సార్లు ఉపసంహరణకు అనుమతి ఇచ్చారు.

కేటగిరీ 2 (గృహ అవసరాలు): ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణాల చెల్లింపు లేదా ఇంటి మరమ్మతుల కోసం సర్వీసు మొత్తంలో ఐదుసార్లు అడ్వాన్స్ పొందే అవకాశం ఉంది.

కేటగిరీ 3 (ప్రత్యేక పరిస్థితులు): ప్రకృతి వైపరీత్యాలు, సంస్థ మూసివేత, ఉద్యోగం కోల్పోవడం లేదా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు నిధులు ఉపసంహరించుకునే వెసులుబాటు కల్పించారు.



## ‘మంజనత్తి’లో భాగమైనందుకు ఎంతో గౌరవంగా భావిస్తున్నాను

కాయదు లోహర్

తెలుగు, తమిళ, కన్నడ మలయాళ ఇలా అన్ని భాషల్లోనూ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతోంది యంగ్ బ్యూటీ కాయదు లోహర్. ‘ఇమ్మోర్టల్’, ‘ఐయామ్ గేమ్’ చిత్రాల తర్వాత ఈ భామ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను తన ఖాతాలో వేసుకుంది. టాలెంటెడ్ డైరెక్టర్ మారి సెల్వరాజ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ‘మంజనత్తి’ మూవీలో ఆమె కీలక పాత్రకు ఎంపికైంది. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్, పూర్ణిమ రవి, కదిర్ కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ కూడా లాంఛనంగా ప్రారంభమైంది. తాజాగా, కాయదు ఈ సినిమా గురించి ఓ షాకింగ్ పోస్ట్ పెట్టింది. “మనుషులను ఎప్పుడూ ఎవరో ఒకరు గమనిస్తూ ఉండటంలోనే ఒక రకమైన హింస దాగుంటుంది. అది ఎవరి మీదైనా కోపంతో చేసేది కాకపోవచ్చు, కనీసం మాట్లాడకుండా కేవలం నిరంతరం కనిపెట్టుకుని చూడటమే ఆ హింస. మనం ఎలా బతకాలో సమాజమే కొన్ని అదృశ్యమైన రూల్స్ పెట్టి వాటితో మనల్ని కొలుస్తూ ఉంటుంది. అణచివేత ఎప్పుడూ అలాగే బతుకుతుంది. ఎవరినీ బలవంతంగా లొంగదీయాల్సిన పనిలేదు. అలా లొంగి ఉ ంటేనే మీకు భద్రత దొరుకుతుందని నమ్మిస్తే చాలు, అదే అణచివేతను ముందుకు నడిపిస్తుంది.

కానీ అలా ఉంటే నిజంగా ఎప్పటికీ భద్రత దొరకదు. ఎందుకంటే అక్కడ ఎప్పుడూ ఇంకో కొత్త రూమ్ ఉంటుంది, ఇంకో కొత్త చూపు ఉ ంటుంది. దాటకూడని మరో హద్దు ఉ ంటుంది.అయినా ఒకరోజు ఆమె ప్రతి రోజు భయపడే.. అడగకూడదన్న ప్రశ్నను ధైర్యంగా అడుగుతుంది. బహుశా ఆ క్షణమే ఈ ప్రపంచం అసలు నిజమేంటో తనంతట తానుగా బయటపెట్టుకోవడం మొదలుపెడుతుంది” అని రాసుకొచ్చారు. అలాగే ‘మంజనత్తి’ ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై స్పందిస్తూ.. మన పరిశ్రమలోని అత్యుత్తమ మేధావులైన మారి సెల్వరాజ్ గారు, గొప్ప ప్రతిభావంతులైన ఇళయరాజా గారితో కలిసి ఈ ప్రయాణాన్ని అనుభవించడం ఈ దశను మరింత ఉత్తేజకరంగా చేస్తుందని అన్నారు. నిజాయితీగా చెప్పాలంటే, ఇది ఒక ఆశీర్వాదంలా అనిపిస్తుందని తెలిపారు. కృతజ్ఞతతో, ఉత్సాహంగా, ఇందులో భాగమైనందుకు ఎంతో గౌరవంగా భావిస్తున్నాను అని పేర్కొన్నారు.

## సెన్సార్ పూర్తి చేసుకున్న సుహాస్ ‘మండాడి’..

టాలీవుడ్ నటుడు సుహాస్, కోలీవుడ్ నటుడు సూరి ప్రధాన పాత్రల్లో, మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ‘మండాడి’. ప్రముఖ నిర్మాత ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై ఆయనే స్వయంగా నిర్మించిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో మహిమా నంబియార్ కథానాయికగా నటించగా ప్రముఖ నటులు సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

సెప్టెంబర్ 10న ఈ చిత్రం విడుదల కాబోతుండగా తాజాగా సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుని ‘యూ/ఏ’ సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చిందని, ముఖ్యంగా సముద్రం నేపథ్యంలో సాగే బోట్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులకు ఒళ్లు గగుర్పొడిచేలా, సరికొత్త సినిమా అనుభూతిని పంచేలా ఉన్నాయని సెన్సార్ సభ్యులు ప్రశంసించడం విశేషం. ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, ఎస్.ఆర్. కథిర్ కెమెరా విజువల్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అంతేకాకుండా, పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బరాయన్, మహేష్ మాథ్యూ వంటి ప్రముఖ




స్టంట్ మాస్టర్లు కంపోజ్ చేసిన హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ సినిమా స్థాయిని మరింత పెంచాయని యూనిట్ తెలిపింది.

ఇప్పటికే చిత్ర యూనిట్ విడుదల చేసిన ప్రచార చిత్రాలు, టీజర్ మరియు ట్రైలర్ ప్రేక్షకులలో విపరీతమైన క్యూరియాసిటీని పెంచాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలోనూ, ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫాం బుక్ మై షోలోనూ ఈ సినిమాకు సంబంధించిన టికెట్లు గంటల వ్యవధిలోనే వందల, వేల సంఖ్యలో అమ్ముడవుతుండటం విశేషం. ఏపీ మరియు తెలంగాణ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి అత్యంత భారీ ఎత్తున విడుదల చేస్తోంది. తమిళ్, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతున్న ఈ చిత్రం, సుహాస్ మరియు సూరి ఇద్దరి కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ సాధించే చిత్రంగా నిలుస్తుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

## విజయ్ దేవరకొండ ‘రణబాలి’ టీజర్ విడుదల!




టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ ‘రణబాలి’కి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ హిట్ చిత్రం ‘టాక్సీవాలా’ తర్వాత విజయ్ దేవరకొండ, టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన మాస్ యాక్షన్ టీజర్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. 19వ శతాబ్దం (1854 - – 1878 మధ్య) బ్రిటిష్ పాలనా కాలం నాటి చారిత్రక నేపథ్యం, రాయలసీమ ప్రాంత ఆధిపత్య పోరాటాలు మరియు వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చారిత్రాత్మక కాన్వాస్ పై ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ శింగనమల బొబ్బిలి రణబాలి పాత్రలో కనిపించనుండగా, రష్మిక ఆయన భార్య జయమ్మ పాత్రలో అత్యంత సంప్రదాయబద్ధంగా, భావోద్వే గాలతో కూడిన పాత్రలో అలరించనున్నారు. అంతేకాకుండా, ఈ చిత్రంలో హాలీవుడ్ ప్రముఖ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన బ్రిటిష్ అధికారి పాత్రలో ప్రధాన విలన్‌గా నటిస్తుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్స్ అజయ్ -- అతుల్ ఈ చిత్రానికి ప్రాణం పోసేలా అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. టీ-సిరీస్ సంస్థ ఈ భారీ పాన్ ఇండియా చిత్రాన్ని సమర్పిస్తోంది. అన్ని కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసుకుంటున్న ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. విడుదలైన మాస్ యాక్షన్ టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత తారాస్థాయికి చేరాయని, విజయ్ కెరీర్‌లోనే ఇదొక బిగ్గెస్ట్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందని అభిమానులు గట్టి నమ్మకంతో ఉన్నారు.

## అజయ్ దేవగణ్ ‘దృశ్యం 3’ ట్రైలర్ విడుదల..

ఈసారైనా విజయ్ చిక్కుతాడా?




బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగణ్ మోస్ట్ అవేటెడ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ చిత్రం ‘దృశ్యం 3: ది కన్‌క్లూజన్’ ట్రైలర్ విడుదలైంది. విజయ్ సల్గాన్కర్ పాత్రలో మరోసారి అజయ్ దేవగణ్ ప్రేక్షకులను మైమరిపించడానికి సిద్ధమయ్యారు. గత రెండు భాగాలు సంచలన విజయం సాధించడంతో, ఈ మూడో భాగంపై ప్రేక్షకుల్లో మరియు సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో అజయ్ దేవగణ్, టబు, శ్రియా శరన్, జైదీప్ అహ్లావత్, ప్రకాష్ రాజ్, రజత్ కపూర్, ఇషితా దత్తా, మృణాల్ జాదవ్, కమలేష్ సావంత్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సస్పెన్స్ క్రైమ్ డ్రామాను అక్టోబర్ 2న గాంధీ జయంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఇక విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేస్తుంది. ఈసారైనా విజయ్ సల్గాన్కర్ పోలీసులకు చిక్కుతాడా లేదా అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.



## ‘లస్ట్ స్టోరీస్ 3’ ట్రైలర్ విడుదల!

ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన మోస్ట్ అవేటెడ్ ఆంథాలజీ చిత్రం ‘లస్ట్ స్టోరీస్ 3’ అధికారిక ట్రైలర్ విడుదలయింది. ఆధునిక కాలంలో ప్రేమ, కోరికలు, మానవ సంబంధాలలోని క్లిష్టమైన భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. చూస్తుంటే ఈసారి మరింత బోల్డ్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో సెప్టెంబర్ 18 నుంచి ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

ఈ చిత్రంలో నలుగురు ప్రముఖ దర్శకులు విక్రమాదిత్య మోత్వానే, కిరణ్ రావ్, శకున్ బాత్రా మరియు విశాల్ భరద్వాజ్ నాలుగు వేర్వేరు లఘు చిత్రాలను తెరకెక్కించారు. ఇందులో కొంకణా సేన్ శర్మ, రాధికా ఆప్టే, విజయ్ వర్మ, అభిషేక్ బెనర్జీ, గుర్తేహ పీర్జాదా, సనా తంపి, అలీ ఫజల్, రాధికా మదన్, అదితి రావు హైదరి మరియు సిద్ధార్థ్ వంటి ప్రముఖ తారాగణం ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

## సూర్య కొత్త చిత్రానికి ‘సీన్’ టైటిల్ పరిశీలన!




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఓ క్రేజీ అప్‌డేట్ వైరల్ అవుతోంది. ‘ఆవేశం’ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని తెరకెక్కించిన యంగ్ డైరెక్టర్ జీతూ మాధవన్ దర్శకత్వంలో సూర్య హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు ‘సీన్’ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఫిల్మ్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది.కొత్త సినిమాలు చూడండి

ఈ చిత్రంలో సూర్య సరసన నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ‘ప్రేమలు’ ఫేమ్ మలయాళ యువ నటుడు నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇది ఒక విభిన్నమైన యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతుండగా, ఇందులో సూర్య పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. మలయాళ ప్రముఖ సంగీత దర్శకుడు సుశిన్ శ్యామ్ ఈ సినిమాకు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ఇప్పటికే పూర్తి కాగా, దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ మరియు విడుదల తేదీపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.


Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com